క్లుప్తంగా

గంగమ్మకు బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తుతున్న భక్తులు

కోవెలకుంట్ల: వరుణదేవుడు కరుణించి వర్షాలు కురువాలని కోరుతూ మంగళవారం మండలంలోని జోళదరాశిలో గంగమ్మకు పూజలు నిర్వహించారు. ఈ ఏడాది రబీ సీజన్ ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా వర్షాలు పడక పోవడంతో సర్పంచ్ ఈర్నపాటి నాగేంద్ర ఆధ్వర్యంలో భక్తులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి గంగమ్మకు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఈర్నపాటి సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆవులకు రోగ నిర్ధారణ పరీక్షలు



ఆవుకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : మండలంలోని ఫతేనగర్ గ్రామంలోని ఆవులకు మంగళవారం జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ రవిబాబు, స్థానిక పశువైద్యులు బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో రోగనిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ గ్రామంలో ఇటీవల రెండు ఆవు దూడలు వ్యాధి భారీనపడ్డాయని, చికిత్స అందించినా కోలుకోలేక మృతి చెందాయన్నారు. దీంతో మృతి చెందిన ఆవుల పేడ, రక్తనమూనాలను పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలకు పంపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు రామకృష్ణ, పశువైద్య సిబ్బంది ఖాజామొహిద్దిన్, ల్యాబ్ టెక్నీషియన్ సునీల్ పాల్గొన్నారు.

పోలీసుల సేవలు చిరస్మరణీయం



గాంధీ విగ్రహం వద్ద అమరులకు నివాళులర్పిస్తున్న పోలీసులు

డోన్ టౌన్ : సమాజంలో శాంతి స్థాపనకు ప్రాణాలు సైతం అర్పించిన పోలీసుల సేవలు చిరస్మరణీయం అని పట్టణ పోలీసు స్టేషన్ ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణ, రూరల్ పోలీసులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాతబస్టాండ్ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద విధి నిర్వాహణలో అమరులైన పోలీసుకు నివాళులర్పిస్తూ గౌరవందనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ విధి నిర్వాహణ ప్రాణాలర్పించిన అమరుల సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో పోలీసులు నగేష్, రామలక్ష్మణ్, చాంద్‌బాషా, నాయక్, వెంకటేశ్వర్లు, ఓబులేసు, శివకుమార్, భాస్కర్, మధు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



కబడ్డీ విజేతలతో చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి

అవుకు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి అన్నారు. దసరా వేడుకల్లో భాగంగా మండల పరిధిలోని ఉప్పలపాడులో నిర్వహించిన కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పెద్దమ్మ తల్లి టీమ్, ఉప్పలపాడు కింగ్స్ టీమ్, రమేష్ టీమ్‌లకు ఆయన బహుమతులు అందజేశారు. అలాగే అవుకు పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతుల అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, తిమ్మరాజు, హర్ష, సుకుర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కోవెలకుంట్ల: మండలంలోని కంపమల్ల మెట్ట సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమచారం మేరకు ఆళ్లగడ్డ మండలం ఓబుళంపల్లెకు చెందిన మహేశ్వరరెడ్డి సొంత పనుల నిమిత్తం బైక్‌పై కోవెలకుంట్లకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా కంపమల్ల మెట్ట వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రున్ని చిక్సిత నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం 108 అంబులెన్స్‌లో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ముగిసిన దేవీ శరన్నవరాత్రోత్సవాలు

• ఘనంగా అమ్మవార్ల విగ్రహాల ఊరేగింపు

కోవెలకుంట్ల: దేవీ శరన్నవరాత్రోత్సవాలు మంగళవారం ముగిశాయి. పట్టణంలోని వాసవీకన్యాకా పరమేశ్వరీదేవి ఆలయంలో సోమవారం వాసవీ మాత వాసవాంబదేవి అలంకారంలో పూజలందుకున్నారు. రాత్రి గ్రామోత్సవం, తొట్టిమెరువని కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో చివరి రోజు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పట్టణంలోని పురవీధుల గుండా వసంతోత్సవం నిర్వహించారు. రాక్షసులు, దేవతల వేషధారణ ఊరేగింపు మధ్య ఆర్యవైశ్యులు రంగులు చల్లుకుని కేరింతలు కొట్టారు. అమ్మవారు వెండిరథంపై పురవీధుల గుండా పూజలందుకున్నారు. అనంతరం ఆలయంలో అమ్మవారి తులాభారం, ఆర్యవైశ్య సమారాధన, పాన్పుసేవ తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

సంజామల: మండల కేంద్రంలో దసరా ఉత్సావాలు భక్తిశ్రద్ధలతో మధ్య ముగిశాయి. స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంతో పాటు వివిధ గ్రామాలలో వెలసిన ఆలయాలలో అమ్మవారిని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వసోంతోత్సవం, అమ్మవారి గ్రామోత్సవం తొట్ల ఉత్సవం(పాన్పు సేవ) తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మెక్కులు తీర్చుకున్నారు.



మారెమ్మ ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



చౌడేశ్వరిదేవిని దర్శించుకున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి జయమ్మ, కుటుబ సభ్యులు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన అమ్మవారు దసరా శరన్నవరాత్రి అలంకారాల్లో భాగంగా విజయదశమి చివరి రోజు శ్రీ చౌడేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ రామానుజన్, అర్చకుల ఆధ్వర్యంలో సాయంత్రం శమీ పూజ, సింహవాహన పూజలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సోమవారం సిద్ధిదాత్రి అలంకారంలో దర్శనమిచ్చిన చౌడేశ్వరి దేవి అమ్మవారిని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ, కోడలు కాటసాని మేధాశ్రీరెడ్డి, కూతురు కాటసాని ప్రతిభారెడ్డి, మనువరాలు భూమా మణికతారరెడ్డి, కాటసాని కాత్యాయణిరెడ్డి దర్శించుకుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు పీఆర్ మురళీరెడ్డి, ఆలయ అర్చకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాసవీ మాత రథోత్సవం

బనగానపల్లె పట్టణంలోని కొండపేటలో దసరాశరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా శ్రీవాసవీకన్యకాపరమేశ్వరిదేవి రథోత్సవ కార్యక్రమం మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. కొండపేట నుంచి ప్రారంభమైన అమ్మవారి రథోత్సవం పట్టణంలోని ప్రధాన పురవీధుల్లో అంగరంగ వైభవంగా సాగింది. కళాకారుల కోలాటం, ఆర్కెస్ట్రా ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీవాసవి మహిళా మండలి,వాసవిక్లబ్ అండ్ వనిత క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రాక్షసులు, దేవతల వేషధారణ కళాకరుల మధ్య వసంతోత్సవం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు



ప్రత్యేక అంకారణలో అమ్మవారు

కొలిమిగుండ్ల: దసరా ఉత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధల మధ్య మంగళవారం ముగిశాయి. అంకిరెడ్డిపల్లెలోని గీతాశ్రమం, తిమ్మనాయిన పేటలోని వాసవీ కన్యాకపరమేశ్వరి ఆలయంలో అమ్మవార్లను నవరాత్రుల్లో భాగంగా రోజుకో రూపంలో అమ్మవారు భక్తులకు కనువిందుచేశారు. ప్రత్యేక పూజలతో పాటు హోమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ



అమ్మవారి పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

డోన్ టౌన్ : విజయానికి చిహ్నంగా జరుపుకునే విజయ దశమి వేడుకలు ముగిశాయి. సోమవారం ఉదయం నుంచే పట్టణంలో పండగ సందడి నెలకొంది. ఉదయం ఇంటిలోని దేవుళ్లకు పూజలు చేసి పెద్దలకు కొత్త బట్టలు ఉంచి సాంబ్రాణి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం దుర్గమ్మ దేవాలయాలతో పాటు గ్రామ దేవతలైన సుంకులమ్మ, పెద్దమ్మ, మారెమ్మ దేవలతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పాతబస్టాండ్ సమీపంలోని ముక్తేశ్వరస్వా ఆలయంలోని జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి జమ్మి ఆకు ఒకరికొకరు ఇచ్చుపుచ్చుకుంటూ విజయ దశిమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఆర్యవైశ్యలు ఆద్వర్యంలో అమ్మవారికి పల్లకీ సేవా

పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘీయులు మంగళవారం పాతబస్టాండ్ సమీపంలో బచ్చు కుటంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీముక్తేశ్వర ఆలయం ఆవరణలో మంటపం ఏర్పాటు చేసి జెమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేసి శమి ఉత్సవాలను నిర్వహించారు. పాతపేటలోని అమ్మవారి శాలలో కోలువైన శ్రీకన్యకా పరమేశ్వరిని అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోత్రికె హరికిషన్, యువజన సంఘం అధ్యక్షుడు కొచ్చెర్వు శ్రీనివాసులతో నాయకులను బచ్చు కుటంబ సభ్యులు సత్కరించారు.

ప్యాపిలి: మండల ప్రజలు సోమవారం విజయదశమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని స్థానిక శ్రీమత్కన్యకా పరమేశ్వరి ఆలయంలో రాజరాజేశ్వరి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ఎడ్లబండ్లను అందంగా అలంకరించిన రైతులు పట్టణ ప్రధాన వీధి మీదుగా ఊరేగింపు నిర్వహించారు.



బేతంచెర్ల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ మాతను పల్లకీ సేవ దృశ్యం



శమీ వక్షం దగ్గర పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



కన్యకా పరమేశ్వరి అలంకారంలో అమ్మవారు

మండలంలో ఘనంగా దసరా వేడుకలు

బేతంచెర్ల: విజయానికి చిహ్నంగా జరుపుకునే దసరా ఉత్సవాలు ముగిశాయి. ఆయా ఆలయాల్లో వెలసిన అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా శ్రీదేవి, భూదేవి,సమేత చెన్నకేశవ స్వామి సాయంత్రం సిద్దేశ్వరస్వామి ఆలయానికి చేరుకోగా మాజీ చైర్మన్ గుండా జగన్ మోహన్ రావు, కమిటీ సభ్యులు బుగ్గన విశ్వనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శమి వృక్షానికి అర్చకులు జయంత్, అన్నారావు పూజలు చేశారు. అదేవిధంగా వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో అమ్మవారు శ్రీ మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీమద్దిలేటి నరసింహస్వామి గరుడ వాహనంపై ఆర్‌ఎస్ రంగాపురం గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. బేతంచెర్ల అమ్మవారిశాలలో వెలసిన వాసవీ మాత గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. ఆర్యవైశ్య సంఘం, వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, మంగళవాయిద్యాల మధ్యన పట్టణ పురవీధుల గుండా అమ్మవారిని ఊరేగించారు. వాసవీ మహిళా మండలి మహిళలు కోళాటం ఆకట్టుకుంది. గూటుపల్లె గ్రామ సమీపాన కొండలో వెలసిన పాలుట్ల రంగస్వామి ఆలయంలో విజయ దశమి పండుగను పురస్కరించుకొని శ్రీదేవి, భూదేవి సమేత రంగస్వామికి వైభవంగా కల్యాణం నిర్వహించారు. హెచ్ కొట్టాల గ్రామ సమీపాన వెలసిన ముచ్చట్ల భ్రమరాంభ, మల్లికార్జునస్వామికి అనంతపురం జిల్లా, తాడిపత్రి మండలం కొమటికుంట్ల గ్రామానికి చెందిన నంబూరి తిలక్ కుమార్ నాయుడు, శ్రావణి దంపతులు 250 గ్రామాల వెండి నాగాభరణాన్ని బహూకరించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఎమ్మెల్యే కాటసానికి కృతజ్ఞతలు

బనగానపల్లె : మండలంలోని చెరువుపల్లెలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, ఇంటింటికీ కుళాయి ఏర్పాటు పనులు పూర్తికావచ్చాయి. దీంతో గ్రామాభివృద్ధికి పాటుపడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి మంగళవారం ఆ గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్లయ్య, గడ్డంబాషా, సూర్యనారాయణరెడ్డి ఆదిరెడ్డి అజయ్‌భార్గవ్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను స్వగృహంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే తమ ధ్యేయమన్నారు. అభివృద్ధి పనులకు నిధుల సమస్యలేదని, చెరువుపల్లెను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల- ఆళ్లగడ్డ ఆర్‌అండ్‌బీ రహదారిలో మండలంలోని కంపమల్ల మెట్ట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. మంగళవారం ఎస్ఐ మౌలానీ అందించిన సమచారం మేరకు ఆళ్లగడ్డ మండలం ఓబుళంపల్లె గ్రామానికి చెందిన మహేశ్వరరెడ్డి(28) కోవెలకుంట్ల మండలం కంపమల్ల గ్రామంలో ఉన్న అక్క రమాదేవి, బావను దసరా పండుగకు పిలుచుకెళ్లేందుకు వచ్చాడు. సోమవారం సోదరి, బావ ఒక బైక్‌పై, మహేశ్వరరెడ్డి మరో బైక్‌పై స్వగ్రామానికి బయలు దేరారు. కంపమల్ల మెట్ట వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రున్ని చిక్సిత నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుని సోదరి రమాదేవి ఫిర్యాదు మేరకు బస్ డ్రైవర్ వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

తీరనున్న రహదారి సమస్య !



కొండను తొలిచి రోడ్డును విశాలంగా మార్చిన దృశ్యం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కొండమీదపల్లె ఓ కుగ్రామం. 600 అడుగుల ఎత్తులో ఉన్న ఈ ఊర్లో దాదాపు 50 కుటుంబాలకుపైగానే నివాసం ఉంటున్నారు. సాధారణంగా ప్రతి ఐదేళ్లకు జరిగే ఎన్నికల సమయంలో మాత్రమే పాలకులు ఓట్ల కోసం తప్ప మిగిలిన రోజుల్లో ఆ ఊరి ముఖం చూడరు. అక్కడున్న ప్రజల సమస్యలను పట్టించుకోరు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కొండమీదపల్లెలో ఆసాధ్యం కాని పనులను సుసాధ్యం చేస్తున్నారు. 2021లో రూ.97 లక్షలతో కింద భాగం నుంచి కొండపైకి తారు రోడ్డు నిర్మించి ఎన్నో ఏళ్ల ప్రధాన సమస్యకు పరిష్కారం చూపారు. అదేవిధంగా రూ.35 లక్షలతో జల్‌జీవన్ మిషన్ పథకం కింద చేస్తున్న ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు చివరి దశకు చేరాయి. ప్రజలు ఎదుర్కొంటున్న మరో ప్రధాన సమస్యను పరిష్కరిస్తున్నారు. తారు రోడ్డుకు ఓవైపు కొండ, మరో వైపు కొండ దిగువ ప్రాంతం ఉండటంతో గ్రామస్తులు రాక పోకలకు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. పలు చోట్ల ప్రమాదకరమైన మలుపులు ఉండటంతో ఏమాత్రం అదుపు తప్పినా ప్రమాదానికి గురికాక తప్పదు అన్నట్లుగా ఉండా రోడ్డు. వర్షాకాలంలో రోడ్డు కోతకు గురవుతుండేది. ఈసమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీచైర్మన్ చర్యలు చేపట్టారు. అధికారులతో చర్చించి రోడ్డుకు చెంతనే ఉన్న కొండను చాలా చోట్ల పది అడుగుల మేర ప్రొక్లెయిన్‌ర్‌తో తొలగించి మలుపులు లేకుండా విశాలంగా చేస్తున్నారు. పలు చోట్ల రక్షణ గోడను నిర్మించనున్నారు. తమ సమస్యను గుర్తించి అడగకుండానే పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రమాదకర మలుపు వద్ద కొండను తొలిచిన దృశ్యం

నేడు గొర్విమానుపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని గొర్విమానుపల్లె గ్రామ సచివాలయ పరిధిలో బుధవారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కార్యక్రమానికి హాజరవుతారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

29 నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

కొలిమిగుండ్ల: తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10లక్షలతో పెద్ద వెంతుర్ల ఎస్సీ కాలనీలో నిర్మించిన మారెమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈనెల 29 నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు సమరసత పౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారకులు శ్రీనివాసులు తెలిపారు. 29న ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, హోమాలు, ప్రాత:కాల పూజలు, మహామంగళహారతి తదితర విశేష పూజలు జరుగుతాయన్నారు. చివరి రోజు 31న మారెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందన్నారు.

వాల్మీకి జయంతి వేడుకలపై సమావేశం

కొలిమిగుండ్ల: వాల్మీకి మహర్షి జయంతి వేడుకలపై మంగళవారం కొలిమిగుండ్లలోని లలితా సుందరేశ్వర స్వామి ఆలయంలో వాల్మీకి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈనెల 28న వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లపై సభ్యులు చర్చించారు. లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో వాల్మీకి చిత్ర పటం ఏర్పాటు చేసి వేడుకలు నిర్వహిస్తామన్నారు. పూజల అనంతరం అన్నదానం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు చెప్పారు.

వ్యక్తిపై కేసు నమోదు

డోన్ టౌన్: వ్యాపారవేత్తపై బెదిరింపులకు పాల్పడిన వెల్దుర్తి పట్టణానికి చెందిన లక్ష్మణ స్వామితోపాటు భార్య, కూతురుపై మంగళవారం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు లక్ష్మణ స్వామి డోన్ పట్టణంలో ఐస్ ఫ్యాక్టరీ నిర్వహించేవాడు. అనివార్య కారణాల వలన ఫ్యాక్టరీ నడుపుకోలేక స్థలం యజమానికి బాడుగ చెల్లించకుండ ఇబ్బందులకు గురి చేస్తుండగా మధ్యవర్తిగా వ్యవహరించిన వ్యాపారవేత్త ఎస్ఎల్ మధుపై కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం మధు ఇంటిలోకి పెట్రోల్, కారం పొడితో చొరబడి తలుపులు మూసి హంగామా సృష్టించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువకుల మధ్య ఘర్షణ

డోన్ టౌన్ : పట్టణంలోని కొత్తపేటలో శ్రీనివాసనగర్‌కు చెందిన శుభాన్‌పై రఘు, జగదీష్, పవన్‌సాయి అనే యువకులు దాడి చేసి తీవ్రంగా గాయపరచినట్లు బాధితుడి బంధువులు తెలిపారు. పాత కక్షల కారణంగా ఈ దాడికి పాల్పడినట్లు తెలిసింది. తీవ్రంగా గాయపడిన శుభాన్‌ను కర్నూలు వైద్యశాలకు తరలించినట్లు బంధువులు తెలిపారు. విషయాన్ని పట్టణ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా దాడి జరిగిన విషయం వాస్తవమేనని, ఇంకా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందలేదన్నారు.

ఓహెచ్ఆర్ ట్యాంక్ ప్రారంభానికి సిద్ధం

సంజామల: మండల పరిధిలోని బొందల దిన్నె గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకం కింద రూ.35 లక్షలతో చేపట్టిన ఓహెచ్ఆర్ ట్యాంక్ నిర్మాణం పూర్తయింది. గ్రామంలో తాగు నీటి సమస్య శాశ్వత పరిష్కారంలో భాగంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరువతో రూ. 35 లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు చేపట్టిన 40 వేల లీటర్ల నీటి సామర్థ్యంతో నిర్మించిన ఓహెచ్ఆర్ ట్యాంక్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. జల్ జీవన్ పథకంతో గ్రామంలో ఇప్పటికే ఇంటింటికీ సురక్షితమైన తాగు నీరు సరఫరా చేసేందుకు ఉచితంగా కుళాయిలను ఏర్పాటు చేశారు. నీటి సమస్యకు శ్వాశత పరిష్కారం లభించడంతో గ్రామస్తులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ మేరకు ట్యాంక్‌ను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.



రూ.35 లక్షలతో నిర్మించిన ఓహెచ్ఆర్ ట్యాంక్

విజేతలకు బహుమతుల ప్రదానం

అవుకు: దసరా ఉత్సవాల్లో భాగంగా వైఎస్సార్ సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో బనగానపల్లె అఖిల్11 టీమ్, మన్నేనాయక్ తాండా టీమ్, కొలిమిగుండ్ల మండలం చింతలాయపల్లె టీమ్ నిలిచాయి.

విజేత టీంలకు రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు చొప్పున అవుకు పీఏసీఎస్ చైర్ పర్సన్ చల్లా విజయభాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి అందజేశారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న చల్లా విజయభాస్కర్ రెడ్డి, దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న దృశ్యం

అవుకు: మండల పరిధిలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన పోలక నాగసుబ్బరాయుడు(36) గుండెపోటుతో మృతి చెందాడు. కొన్నేళ్లుగా సాగులో ఆశించిన దిగుబడులు రాకపోవటంతో ఒత్తిడికి గురై గుండెపోటుతో మృతి చెందాడని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న అవుకు బలిజ సంఘం సభ్యులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తమవంతుగా ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో సభ్యులు కంపిలి నారాయణ, గుర్రాల రామాంజినేయులు, హరిప్రసాద్, రమేష్, సుబ్రమణ్యం, గురు తదితరులు పాల్గొన్నారు.

శేషారెడ్డి విగ్రహం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు



కర్నూలు, నంద్యాల రోడ్డు సర్కిల్‌లో ఏర్పాటు చేస్తున్న బీపీ శేషారెడ్డి విగ్రహం

బేతంచెర్ల: పట్టణంలోని కర్నూలు, నంద్యాల సర్కిల్‌లో రావు బహదూర్ బీపీ శేషారెడ్డి విగ్రహం ఏర్పాటు పనులను ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి లు పరిశీలించారు. మండల కేంద్రమైన బేతంచెర్లలో ముందుచూపుతో బడి, గుడి, వైద్యశాల, పశువైద్యశాల, కల్యాణశాల ఏర్పాటు చేసిన రావు బహదూర్ బీపీ శేషారెడ్డి సేవలకు గుర్తుగా కర్నూలు, నంద్యా రోడ్డు సర్కిల్‌లో రావు బహదూర్ బీపీ శేషారెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. త్వరలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా రావు బహదూర్ బీపీ శేషారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని తెలిపారు.

బైక్ దగ్ధం

డోన్ టౌన్ : పట్టణంలోని కొత్తపేటలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వెనుక వీధిలో నివాసం ఉంటున్న పూల వ్యాపారి రంగన్న బైక్ అగ్నికి ఆహుతైంది. సోమవారం ఇంటి బయట పార్క్ చేసిన బైక్ అర్ధ రాత్రి మంటల్లో పూర్తిగా కాలిపోయింది. ఈ సంఘటన ప్రమాదవశాత్తు జరిగిందా.. ఎవ్వరైనా నిప్పు పెట్టారా అనే విషయం తెలియడం లేదని బాధితుడు వాపోయాడు. ఈ మేరకు పట్టణ ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.